

హుజూరాబాద్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలన్

హుజూరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పథ సంచలన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని విద్యానగర్ శిశుమందిర్ నుంచి హనుమాన్ ఆలయం మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్..



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

- ప్రజల సహకారంతోనే ప్రజాపాలన
- కాళేశ్వరం, మిషన్ భగీరథ పేరుతో గత ప్రభుత్వం లక్షల కోట్ల అప్పు
- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

హుజూరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాడని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. హుజూరాబాద్ లో పౌర సమాజంతో మాట ముచ్చట కార్యక్రమం టీజేఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ముక్కెర రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దామంటే డబ్బులు లేవన్నారు. వచ్చే ఆదాయమంతా కేసీఆర్ చేసిన అప్పులకు మిత్తిలు కట్టడానికే సరిపోతుందన్నారు. రాష్ట్రంలో ప్రజల సహకారంతోనే నిరంకుశ పాలన పోయి ప్రజాపాలన వచ్చింద న్నారు. గత ప్రభుత్వ హయాంలో ఫోన్లు ట్యాపింగ్ చేయడంతో భార్య భర్తలు మాట్లాడుకోవడానికి భయపడ్డారన్నారు. కాళేశ్వరం పేరుతో లక్షల కోట్ల అప్పులు చేసి 50వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వలేదన్నారు. మిషన్ భగీరథ పేరుతో తాగడానికి గుక్కెడు నీళ్ల సరఫరా చేయలేదని విమర్శించారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రం పూర్తిగా పదేళ్ల వెనుకబడిందన్నారు. అనం తరం కోదండరాంకు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులు, జర్నలిస్టులు, ప్ర జా సంఘాల నాయకులు, హుజూరాబాద్‌ను పీవీ జిల్లా చేయాలని, పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సమావేశంలో సదానందం, రత్నం, ఈశ్వర్‌రెడ్డి, రవీందర్, తిరుపతి, నర్సింగ్, చారి, ప్రభాకర్ పాల్గొన్నారు.

- తెలంగాణ రావడానికి కృషి చేసిన వ్యక్తి కోదండరాం..

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్

తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ రావడానికి కృషి చేసిన వ్యక్తి కోదండ రాం అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్‌కు వచ్చిన ప్రొఫెసర్ కోదండరాంకు ప్రణవ్ స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యమకారులను ఆనాటి ప్రభుత్వం విస్మరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వారికి సముచిత స్థానం కల్పిస్తున్నామన్నారు.

జీవో 317 బాధితులను సొంత జిల్లాలకు బదిలీ చేయాలి

- ధర్మ పోరాట నిరసన దీక్ష చేపట్టిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు



ధర్నాలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకుడు రఘుశంకర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జారీ చేసిన 317 జీవోతో అనేక మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని, వెంటనే బాధితులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట జీవో 317తో స్థాన భ్రంశం చెందిన ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో న్యాయం కోసం ధర్మ పోరాటం పేరిట నిరసన దీక్షా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరై 317 జీవో బాధితులకు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే జీవో 317పై ఉప సంఘం ఇచ్చిన జీవోను బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు. బదిలీపై ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులను వెంటనే వారి సొంత జిల్లాలకు ప్రభుత్వం బదిలీ చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్య, వివిధ సంఘాల రాష్ట్ర బాధ్యులు ఎం రఘుశంకర్‌రెడ్డి, పులి సర్వోత్తంరెడ్డి, మాడుగుల రాములు, జైపాల్‌రెడ్డి, గాజుల రవీందర్, హుస్సేన్, రవీంద్రాచారి, తిరుపతి, జేఏసీ గౌరవ అధ్యక్షుడు పింగళి రమేశ్‌రెడ్డి, అధ్యక్షుడు భారత్ కుమార్‌స్వామి, వేముల శ్రీనివాస్, దత్తు, అబ్దుల్ రజాక్, ప్రసూన, మమత, రత్నమాల, అజయ్, మహేందర్, శివ, నరసయ్య పాల్గొన్నారు.

విలీన గ్రామాలకు 'అమృత్' నిధులు



- డీపీఆర్ రూపకల్పన

రెండో విడత 147 కోట్ల రూపాయలతో నగరపాలక సంస్థలో విలీన గ్రామాలైన డివిజన్లకు తాగునీటిని కరీంనగర్‌లో మాదిరిగా ప్రతిరోజు నల్లాల ద్వారా సరఫరా చేసేందుకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను రూపొందించారు. 2050వరకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజు కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజు శుద్ధిచేసిన నీటిని సరఫరా చేసే విధంగా ప్రణాళికలను రూపొందించి ప్రజారోగ్యశాఖ ద్వారా టెండర్లను నిర్వహించారు. ఈ నిధులతో శివారు ప్రాంతాలు, విలీన డివిజన్లలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేయాలని గడువు విధించారు. రెండో విడత అమృత్ పనులకు కేంద్రహోంశాఖ సహాయమంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ఎల్‌ఎండీ సమీపంలోని ఫిల్టర్‌బెడ్ సమీపంలో సోమవారం శంకుస్థాపన చేయనున్నారు.

- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- రెండో విడతలో రూ. 147 కోట్ల విడుదల
- నేడు పనులు ప్రారంభించనున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థల వాటాతో అమృత్ పథకానికి శ్రీకారం చుట్టాయి. కరీంనగర్ నగరపాలక సంస్థకు అమృత్ మొదటి విడతలో 132 కోట్లు విడుదల కాగా, రెండో విడతలో 147 కోట్లు మంజూరయ్యాయి. మొదటి విడతలో 40 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 20శాతం మున్సిపల్ వాటాతో పనులను పూర్తి చేశారు. రెండో విడతలో 147 కోట్లు మంజూరు చేయగా అందులో 40శాతం కేంద్ర ప్రభుత్వం, 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 10శాతం మున్సిపల్ నిధులను సమకూర్చాల్సి ఉంటుంది.

- 14 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం

రెండో విడత నిధులతో ప్రత్యేకంగా 10 ఎంఎల్‌డీ సామర్థ్యంతో కూడిన మరో ఫిల్టర్ బెడ్, రా వాటర్ సంపు, రేకుర్తిలో మేయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తోపాటుగా విలీన డివిజన్లలో అక్కడి జనాభాకు అనుగుణంగా కొత్తగా 14 రిజర్వాయర్లను నిర్మించనున్నారు. పైపులైన్లు, డిస్ట్రిబ్యూటరీ లైన్లను ఏర్పాటు చేసి కరీంనగర్‌లో మాదిరిగా నీటిని సరఫరా చేసే విధంగా ప్రణాళిక తయారు చేశారు.

నగరపాలక సంస్థ పరిధిలో అమృత్ మొదటి విడత 132 కోట్లతో చేపట్టిన మంచినీటి నీటిశుద్ధి కేంద్రం (ఫిల్టర్‌బెడ్స్), మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తోపాటు జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకొని రిజర్వాయర్లను, పైపులైన్లను వేయడంతో ప్రస్తుతం కరీంనగర్‌లో ప్రతిరోజూ మంచినీటి సరఫరా జరుగుతోంది. పట్టణీకరణ రోజురోజుకు పెరుగు తుండడంతో నగరపాలక సంస్థ విస్తీర్ణం నలుదిశలా వేగంగా విస్తరిస్తోంది. కొత్తగా ఏర్పడిన శివారుకాలనీలతోపాటు గత మున్సిపల్ ఎన్నికలకు ముందు నగరపాలక సంస్థలో విలీనం చేసిన పద్మనగర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, అల్గునూర్, సదాశివపల్లికి తాగునీటిని

మిగతా 8వ పేజీలో...

మాలలు ఐక్యంగా ఉండాలి

- డిసెంబరు 1న నిర్వహించనున్న సభను విజయవంతం చేయండి
- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

సుభాష్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాలలు ఐక్యంగా ఉండాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లో మాల, మాల ఉపకులాల ఐక్యత అభివృద్ధి సభను నిర్వహించారు. ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాలల ఐక్యత కోసం నాగర్ కర్నూల్‌లో నిర్వహించిన సభ విజయవంతమైందని, అదే స్ఫూర్తితో సభలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మాలలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తన తండ్రి 78 వేల గుడిసెలు వేయించినప్పుడు ఆయనను నువ్వు మాలనా, మాదిగనా అని ఎవరూ అడగలేదన్నారు. సంవత్సర కాలంగా మాలలపై అనేక విమర్శలు వస్తున్నాయన్నారు. మాల జాతిపై జరుగుతున్న ప్రచారంపై సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. డిసెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభకు భారీ సంఖ్యలో మాలలు తరలివచ్చి ఐక్యత చాటాలన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కులవృత్తి లేకుండా సమాజ హితం కోసం పోరాడేది మాలలే అని అన్నారు. జాతి కోసం పనిచేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య మాట్లాడుతూ దళితులంతా ఐక్యంగా ఉండాలని తాను మంత్రిగా ఉన్నప్పుడు 1,200 సంఘాలను స్థాపించానని తెలిపారు. దళితుల ఐక్యత చూసి ఆరోజుల్లో అందరూ భయపడేవారన్నారు. తాను చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా ఉన్నపుడు వర్గీకరణ అంశం వచ్చిందని, ఆనాడే దానిని వ్యతిరేకించానని అన్నారు. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మెన్ మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళితుల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు, దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకు ఎస్సీ వర్గీకరణ తెచ్చారని అన్నారు. వర్గీకరణ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలన్నారు. కులాల్లో వెనకబాటుతనం ఉంటే ప్రత్యేక పథకాలు అమలు చేయాలన్నారు.



సభలో అభివాదం చేస్తున్న నాయకులు

కార్యక్రమంలో ఈసరి జనార్దన్, అర్ష మల్లేశం, మర్రి వెంకటస్వామి, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, రిటైర్డ్ ఈడీ డి సర్వయ్య, కొరివి వేణుగోపాల్, మామిడి నారాయణ, మేడి రాజవీరు, మందాల భాస్కర్, గంట శ్రీనివాస్, గంట కళ్యాణి, మేడి మహేశ్, నక్క రాజయ్య, కాడె శంకర్, సతల్లా సాగర్, నల్లల కనకరాజు, తీట్ల ఈశ్వరి, గంటల రేణుక, మేడి అంజయ్య, దాసరి దశరథం, రొడ్డ శ్రీనివాస్, సిగిరి రవీందర్ పాల్గొన్నారు.



కరీంనగర్ బైపాస్ రోడ్డులో మంచినీటి పైపులైను లీకేజీ మరమ్మతు కోసం తవ్వి వదిలిపెట్టిన రోడ్డు

తవ్వారు.. వదిలేశారు..

- మానేరు బైపాస్ రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

కరీంనగర్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉండే కరీంనగర్-సిరిసిల్ల-జగిత్యాల బైపాస్‌రోడ్డు మంచినీటి పైపులైన్ లీకేజీ కారణంగా తవ్వి పైపైనే పూడ్చారు. 10 రోజుల క్రితం రోడ్డును తవ్వి పూర్తిస్థాయిలో గుంతను పూడ్చక పోవడంతో ప్రమాదకరంగా తయారైంది. దీంతో గుంతలో వద్ద నుంచి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరుగతున్నాయి. రోడ్డుపై భారీ గుంత ఏర్పడడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన బైపాస్ రోడ్డును అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ప్రమాదకరంగా మారిన బైపాస్ రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని, వెలుగని వీధిదీపాలను మార్చి, కొత్త లైట్లను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి
- రాష్ట్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
◆ భగత్‌నగర్, ఆంధ్రజ్యోతి
7

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి
- శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి
◆ కరీంనగర్ స్పోర్ట్స్, ఆంధ్రజ్యోతి
6

శిల్పకళా నైపుణ్యం
- శిలలకు ప్రాణం పోస్తున్న శిల్పులు
- 15 ఏళ్లుగా దేవతామూర్తుల రూపకల్పన
- ఇతర జిల్లాలకు సరఫరా
◆ హుజూరాబాద్, ఆంధ్రజ్యోతి
7



అక్రమాలకు ఐరిస్‌తో అడ్డుకట్ట

- రైతులకు తప్పనున్న ఇబ్బందులు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మొదటిసారి ఐరిస్ విధానాన్ని ఉపయోగించనున్నట్లు పౌరసరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నారు. గతంలో ఆధార్ నంబర్, సంబంధిత రైతు సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా ధాన్యం కొనేవారు. తాజాగా ఓటీపీతో పాటు ఐరిస్(కనుపాపల స్కానింగ్) విధానం అమలు ద్వారా అక్రమాలకు ఆస్కారం ఉండబోదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో అత్యంత పారదర్శకంగా కొనుగోలు జరగనుండటంతో రైతులు ఇబ్బందులు తొలగనున్నాయి.



: చెల్పూర్‌లో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

- ఎందుకు ఐరిస్..?

గతంలో రైతుల ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతాను నమోదు చేస్తే వారి సెల్ ఫోన్‌కు ఓటీపీ వచ్చేది. దాని ద్వారా ధాన్యం కొనేవారు. ఈ క్రమంలో రైతుల పేరిట వ్యాపారులు, దళారులు ధాన్యం విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో జిల్లాలో కొందరు దళారులు ఇతర ప్రాంతాల నుంచి ధాన్యాన్ని తీసుకొచ్చి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి సొమ్ము చేసుకున్నారని విమర్శలు వచ్చాయి. ఐరిస్ విధానాన్ని అమలు చేయడం ద్వారా ధాన్యం విక్రయించే రైతులు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాలకు రావాల్సి ఉంటుంది. ధాన్యం తూకం పూర్తయిన తర్వాత కేంద్రం నిర్వాహకులు సదరు రైతు ఐరిస్ తీసుకోనున్నారు.

- కౌలు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా...

ఐరిస్ విధానం ద్వారా ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు కంటే ముందే సంబం ధిత ఏఈవోలను కలిసి ఎవరి భూములు కౌలుకు తీసుకున్నారో వివరాలు నమోదు చేసుకోవాలని కౌలు రైతులకు అధికారులు సూచి స్తున్నారు. రైతులు సమర్పించిన వివరాలను ఏఈవోలు ఓపీఎంఎస్ (ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెట్ మేనేజ్ మెంట్ సిస్టమ్)లో నమోదు చేస్తారు. దీంతో కౌలు రైతులు ధాన్యం విక్రయించేందుకు అవకాశముం టుంది. సిగ్నల్ సమస్య ఉన్న ప్రాంతాల్లో, వేలి ముద్రలు సరిగ్గా పడని వారికి ఐరిస్‌తో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



జూపాక గ్రామంలోని ప్రాథమిక సహకార కార్యాలయంలో ఉన్న ఐరిస్ యంత్రం

పారదర్శకంగా కొనుగోళ్ల ప్రక్రియ

-గోస్కుల వివేకానంద, సీఈవో, హుజూరాబాద్ సెంటర్



ఐరిస్ విధానం అమలైతే ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకతకు అవకాశం ఉంటుంది. పొరపాట్లు, సాంకేతిక ఇబ్బందులు తొలగటంతో పాటు రైతులకు మేలు జరుగుతుంది. ఐరిస్‌తో రైతుల పూర్తి వివరాలు నమోదవుతాయి. ధాన్యం డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.



విక్రయానికి తరలించేందుకు సిద్ధం చేస్తున్న జామ పంట

తక్కువ పెట్టుబడితో పండ్ల తోటలను సాగు చేసి లాభాలు గడిస్తున్నాడు తిరుపతిరెడ్డి అనే రైతు. అందరు రైతుల్లా కాకుండా కాస్త ప్రత్యేకంగా ఆలోచించి పండ్ల తోటల సాగు వైపు మొగ్గు చూపాడు. సీజనల్ పండ్లు దొరకడంతో పాటు తాజాగా ఉండడంతో అమ్మకాలు కూడా బాగానే ఉంటున్నాయి. పండ్ల తోట కూడా రహదారికి పక్కనే ఉండడంతో వచ్చీపోయే వారు కొనుగోలు చేస్తుంటారు. చుట్టు పక్కల గ్రామాలే కాకుండా జిల్లా కేంద్రానికి కూడా పండ్ల వ్యాపారులు హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు.

పండ్ల తోటలతో అధిక లాభాలు

- ఏటా రూ. 8 లక్షల మేర ఆర్జన
- తోట వద్దే అమ్మకాలు

జామ పంటను తెంపుతున్న రైతు తిరుపతిరెడ్డి

గొల్లపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామానికి చెందిన గుండేటి తిరుపతి రెడ్డి అనే రైతు పండ్ల తోటల సాగుతో లాభాలు గడిస్తున్నాడు. ఏడాది పొడవునా సీజనల్ పండ్లతో పాటు కూరగాయలు కూడా సాగు చేస్తూ ఏటా రూ. 8 లక్షల మేర ఆదాయాన్ని పొందుతున్నాడు. మార్కెట్లో ధర కంటే తక్కువకు అందించడంతో పాటు పండ్లు కూడా తాజాగా ఉండడంతో విని యోగదారులు ఇష్టపడి కొంటుంటారు.

● ఏటా రూ. 8 లక్షల ఆదాయం

మండలంలోని శ్రీరాముల పల్లె గ్రామ రెవెన్యూ పరిధిలోని జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారికిరువైపులా తిరుపతి రెడ్డికి చెందిన ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో ఏడాది పొడవునా జామ, బొప్పాయి, కర్బూజ, మామిడి వంటి పండ్ల తోటలను సాగు చేస్తున్నాడు. పండ్ల తోట రోడ్డు పక్కనే ఉండడంతో రోడ్డున వచ్చీ పోయే వారు ఆగి మరీ ఇష్టమైన పండ్లను కొనుగోలు చేస్తుంటారు. పండ్ల తోటల పెంపకం కోసం రూ. 2 నుంచి 3 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నాడు. అన్ని ఖర్చులు పోనూ ఏటా రూ. 8 లక్షల మేర లాభం వస్తుందని తిరుపతి రెడ్డి తెలిపారు. ఎప్పటికప్పుడు సీజనల్ పండ్లు అందుబాటులో ఉంచడంతో డిమాండ్ కూడా బాగానే ఉంటుంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో డిమాండ్‌కు పంట చేతికంది రావడంతో తోటల వద్దనే రిటేల్, హోల్ సెల్‌గా విక్రయిస్తున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పండ్ల వ్యాపారులు, ఇతర చిరు వ్యాపారులు సైతం పెద్ద మొత్తంలో పండ్లు కొనుగోలు చేస్తున్నారు. హోల్‌సేల్‌గా విక్రయాలు చేస్తుండడంతో లాభాలు కూడా ఆశించిన స్థాయిలో ఉంటున్నట్లు రైతు తెలిపాడు.



శ్రీరాముల పల్లెలో బొప్పాయి పంట సాగు

లాభదాయకంగా ఉంది

-తిరుపతి రెడ్డి, రైతు



సాంప్రదాయ పంటల సాగు కంటే పండ్ల తోటల పెంపకం వల్ల అధిక లాభాలు గడించవచ్చు. శ్రమ అధికంగా ఉంటుంది,అందుకు తగ్గట్లు లాభాలు సైతం ఉంటాయి. ఆరేళ్లుగా జామ, బొప్పాయి, మామిడి, కర్బూజ వంటి పండ్ల తోటలను పండిస్తున్నాను. కుటుంబ సభ్యుల సహకారంతోనే సాగు చేస్తున్నాను.

'ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దుకు కుట్ర'

కరీంనగర్ టౌన్, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): ఓసీల్లోని ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు ప్రస్తుతం అమలులో ఉన్న 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు ఆరోపించారు. ఆదివారం కరీంనగర్‌లో ఓసీ జేఏసీ రాష్ట్ర వివిధ జిల్లాల ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న రిజర్వేషన్లకు భంగం వాటిల్లితే చూస్తూ ఊర్కోబోమన్నారు. తెలంగాణ ఉద్యమ తరహాలో ఓసీ జేఏసీ ఆధ్వర్యంలో తీవ్రస్థాయిలో ప్రతిఘటించి ప్రభుత్వాలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయాలని దశాబ్దకాలం పోరాడి సాధించుకుంటే విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కల్పిస్తోందని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వే షన్లను రద్దు చేయకుండా అగ్రకులాల పేదలకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి
- కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల తనిఖీ



మాట్లాడుతున్న శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 3: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులను, గ్రంథాలయ గదిని పరిశీలించారు. అనంతరం బాక్సింగ్, జూడో, స్విమ్మింగ్ పూల్, సింథటిక్, అథ్లెటిక్ ట్రాక్, విద్యార్థుల హాస్టల్ గదులను పరిశీలించారు. విద్యార్థులు ఆయా క్రీడల్లో తీసుకుంటున్న శిక్షణ గూర్చి కోచ్‌లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలా శిక్షణ పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒలంపిక్ స్థాయికి ఎదిగేలా లక్ష్యం పెట్టుకోవాలన్నారు. పారా ఒలింపిక్స్‌లో దీప్తి కనబరిచిన ప్రతిభను ఆయన విద్యార్థులకు వివరించారు. హకీంపేట స్కూల్ తరహాలో అన్ని సౌకర్యాలు కల్పిస్తానని వాటిని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. సీఎం కప్ పోటీల్లో అద్భుతమైన ప్రదర్శనను కనబరచాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వి శ్రీనివాస్‌గౌడ్, కోచ్‌లు పవన్, సాయిరాం, శ్యాం, చందు, సంపత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జాప శ్రావణ్‌రెడ్డి, కిమ్ ఫహద్, గట్టు ప్రశాంత్, ఆకుల ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందించడమే ధ్యేయం



జ్యోతి ప్రజ్వలన గావిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కార్తీక, శ్రావణ మాసాలకు ఎంతో విశిష్టత ఉన్నదని, రెండు మాసాలలో దేవాలయాల సందర్శనకు ప్రజలు ఎంతో ప్రాధాన్యం ఇస్తారని అన్నారు. కార్తీక మాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు అవసరమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కార్తీక మాసంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఇదే తొలిసారి అని అన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే బడ్జెట్‌లో 50 కోట్ల రూపాయలను కేటాయించిందని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా రాజన్న ఆలయ ఆవరణలో సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఏఈఓలు గజ్వేల్లి రమేష్ బాబు, బి.శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు బి తిరుపతిరావు, ప్రోటోకాల్ పర్యవేక్షకులు జి.అశోక్ కుమార్, పీఆర్‌వో శివ సాయి ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కార్తీక మాసం సందర్భంగా ఆదివారం సాయంత్రం రాజరాజేశ్వర స్వామి వారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జనగామ గ్రామంలో జనగామ శ్రీనివాస్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం సాయంత్రం మద్యం సేవించి ఇంటికి వచ్చిన శ్రీనివాస్ చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. అనారోగ్య సమస్యలతో పాటు మద్యానికి బానిసైన శ్రీనివాస్ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు. మృతుడి భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆలయంలో చోరీకి యత్నించిన దుండగుడి పట్టివేత

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాలనీలోని అయ్యప్ప ఆలయంలో చోరీకి యత్నించిన దుండగుడిని ఆలయ అర్చకుడు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆదివారం ఆలయ ఆవరణలోని టేబుల్ మీద డబ్బుల బ్యాగ్‌ను ఉంచి అర్చకుడు దేవ్‌ప్రకాష్ పాండే పూజలు చేస్తుండగా ఆలయంలోకి అలుగువెల్లి రమేష్‌రెడ్డి అనే వ్యక్తి చొరబడ్డాడు. అనుమానించిన అర్చకుడు ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డికి సమాచారం అందించాడు. చాలాసేపు ఆలయ ఆవరణలో సంచరించిన రమేష్‌రెడ్డి నగదు బ్యాగ్‌ను ఎత్తుకెళ్లగా, దేవ్‌ప్రకాష్, చంద్రశేఖర్‌రెడ్డి వెంబడించి పట్టుకున్నారు. ఈక్రమంలో దుండగుడు చంద్రశేఖర్‌రెడ్డి బొటన వేలిని కొరికాడు. రమేష్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

అంధకారంలో రైల్వేస్టేషన్

- ఆధునికీకరణ పనులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం

కరీంనగర్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనుల్లో తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగి అంధకారం నెలకొంటోంది. ఆదివారం రాత్రి 7గంటల ప్రాంతంలో కరీంనగర్ నుంచి తిరుపతికి వెళ్లాల్సిన ప్రయాణికులు రైల్వే స్టేషన్‌లో కరెంటు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఫ్లాట్ ఫారంపై ఒక్కటే ఫ్లడ్ లైట్ ఉండటంతో రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు ఇక్కట్లు పడ్డారు. రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు జరుగుతుండడంతో విద్యుత్‌కు అంతరాయం కలుగుతోందని అధికారులు తెలిపారు. వెంటనే ప్రయాణికుల సౌకర్యార్థం కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో కరెంటు సరఫరా నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



చీకట్లో రైలు, ప్రయాణికులు

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను తెలంగాణ ప్రభుత్వం వెంటనే పర్మనెంట్ చేయాలని ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శులు కే.రవిచందర్, వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. అదివారం పట్టణంలోని మహాజన్ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర స్టాఫ్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాలుగవ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని కోరారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ పొందిన గంగమ్మను రాష్ట్ర నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మధురమ్మ, నాయకులు హుస్సేన్, ఉస్మాన్, లక్ష్మణ్, నవీన్, మహేష్, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి కాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- ఏడేళ్లుగా పట్టించుకోని అధికారులు
- పశువులకు నిలయంగా మారిన వైనం
- ఆందోళనలో లబ్ధిదారులు



సైదాపూర్ మండలం ఎలబోతారంలో పశువులకు నిలయంగా మారిన ఇళ్లు

సైదాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలానికి మంజూరైన 40 డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి చేయక పోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అప్పటి ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తన దత్తత గ్రామమైన ఎలబోతారం గ్రామానికి 40 ఇళ్లను కేటాయించారు. ఊరు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టేందుకుఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ 2017 అక్టోబరు 23న శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ఇందులో ఏడు ఇళ్ల పనులు స్లాబ్ వరకు పూర్తయ్యాయి. మరో ఎనిమిది ఇళ్ల పనులు పిల్లర్స్ వరకు పూర్తయ్యాయి. నాలుగు ఇళ్లు బేస్ మెంట్ వరకే చేశారు. మిగతా 21 ఇళ్ల పనులు ప్రారంభించలేదు. కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే వదిలి వేయడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అనంతరం అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు సైతం ఈ విషయాన్ని పట్టించుకోక పోవడంతో పనులు ముందుకు సాగలేదు. అప్పటి ప్రభుత్వం పట్టించుకో లేదని, కాంగ్రెస్ సర్కారు అయినా పనులు పూర్తి చేసి అందజే యాలని గ్రా మస్థులు కోరుతున్నారు. కాగా తనకు ఉండ డానికి నివాసం లేకపోవడంతో అదే గ్రామానికి చెందిన కర్ణకంటి రాజయ్య అనే వ్యక్తి తన కుటుంబంతో స్లాబ్ వేసిన ఇంటోనే చట్టూ పరుదలు కట్టుకొని నివాసం ఉం టున్నాడు. తమది నిరుపేద కుటుంబమని, కూలీ పని చేసుకొని జీవిస్తున్నామని వాపోతున్నాడు. ప్రభుత్వం స్పందించి ఇళ్లు పూర్తి చేసి అందించాలని కోరాడు.

పనులు పూర్తి చేయాలి..

గ్రామంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు పూర్తి చేయాలి. ఏడేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. ఇప్పటికీ పూర్తి కాని పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఎలబోతారం గ్రామంలో పర్యటించి పనులు నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు పూర్తి చేయాలి. లబ్ధిదారులకు త్వరగా అందజేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- మ్యాకల శిరీష, మాజీ సర్పంచ్, ఎలబోతారం



ఎలబోతారంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

క్రైం కార్నర్

వాహనాల తనిఖీల్లో గంజాయి పట్టివేత



మాట్లాడుతున్న టౌన్ సీఐ వేణుగోపాల్

జగిత్యాల క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వంద గ్రాముల గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను జగిత్యాల టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వంద గ్రాముల గంజాయిని సీజ్ చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు టౌన్ సీఐ వేణుగోపాల్ ఆదివారం వివరాలు వెల్లడించారు. జగిత్యాల రూరల్ మండలం బాలెపెల్లికి చెందిన జక్కుల మధు, పెగడపెల్లి మండలం వెంగళాయి పేటకు చెందిన రాచర్ల వంశీ, పెద్దపెల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కల గూడూరు నలిమెల వినోద్ అనే ముగ్గురు వ్యక్తులు ఇతర ప్రాంతం నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి జగిత్యాలలో విక్రయించేందుకు స్కూటీపై బైపాస్ రోడ్ మీదుగా జగిత్యాలకు వస్తున్నారు. రాజీవ్ బైపాస్ చౌరస్తాలో టౌన్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. దీంతో గంజాయి పట్టుబడింది. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో వంశీపై గతంలో రెండు, వినోద్‌పై ఏడు గంజాయి కేసులు నమోదైనట్లు సీఐ వివరించారు. టౌన్ ఎస్సై మన్మథ రావు తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



గణేశ్(ఫైల్)

కరీంనగర్ క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని కృష్ణనగర్‌కు చెందిన బొమ్మెన సాయి గణేశ్(17) అనే ఇంటర్ విద్యార్థి శనివారం నుంచి కనపడకుండా పోయాడని అతని తండ్రి తిరుపతి ఫిర్యాదు చేశాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం కళాశాలకు వెళ్తున్నట్లు ఇంటి వద్ద చెప్పి బయటకు వెళ్లిన సాయి గణేష్ రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెదికినా ఆచూకీ లభించలేదని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు



గాయపడిన మహర్షి

వేములవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో ఆదివారం వీధి కుక్కలు దాడి చేసిన ఘటనలో పలువురు చిన్నారులు గాయపడ్డారు. ఆరుబయట ఆడుకుంటున్న చేని మహర్షి, మామిండ్ల రుత్విక్, రాణా అనే చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఇష్టానుసారంగా కరవడంతో గాయపడ్డారు. స్థానికులు వారిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి వీధి కుక్కల బెడద నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ఐదుగురిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ఆదివారం ఐదుగురుపై పిచ్చికుక్క దాడిచేసింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. బండపల్లికి చెందిన నేదూరి రమేశ్, గడ్డం పుష్పవ్వ, గోపి ప్రకాశ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఇద్దరు వలస కూలీలపై పిచ్చికుక్క దాడి చేసింది. గాయపడినవారిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇద్దరిపై దాడి... కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని బోయవాడలో శనివారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులపై దాడికి పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేశామని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. బోయవాడకు చెందిన సివిల్ కాంట్రాక్టర్ అయిన ఎర్రోజు రఘుకుమార్, నిశాని సంపత్‌లు ఇంటి నుంచి కమాన్ వైపు వెళ్తుండగా భారత్ థియేటర్ వద్ద అదే ప్రాంతానికి చెందిన సాత్విక్ అలియాస్ రిచ్చు, అతని సోదరుడు రేణు, వారి తండ్రి రాజేశంలు కలిసి కట్టెలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచారని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

మెట్‌పల్లి టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని ఆదివారం ఉదయం పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎలాంటి అనుమతులు లేకుండా కథలాపూర్ మండలం నుంచి మెట్‌పల్లి పట్టణం మీదుగా నిజామాబాద్ వెళ్తున్న టీఎస్ 16యూఎ 0006 నెంబర్ గల ఇసుక లారీని ఉదయం పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్‌ను విచారించగా కథలాపూర్ నుంచి నిజామాబాద్ తీసుకెళ్లి అక్కడ అధిక ధరకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపాడు. డ్రైవర్‌ను, యాజమానిని అదుపు లోకి తీసుకోని వారిపై కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య



కొమరమ్మ(ఫైల్)

ఓదెల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపులకు చెందిన వడ్లూరి కొమరమ్మ (60) అనే వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పొత్కపల్లి ఏఎస్ఐ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కొమురమ్మ 16 సంవత్సరాల నుంచి మతిస్థిమితం లేకపోవడంతో పాటు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. గత నెల 30 వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంటిలో పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలు కొమరమ్మ భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కిషన్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నరేష్(ఫైల్)

కమాన్‌పూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన నంది నరేష్(24) అనే యువకుడు పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నంది నరేష్(24) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి నరేష్ గ్రామ శివారులో పురుగుల మందు తాగినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆదివారం సాయంత్రం పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నరేష్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి

- మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ప్రభుత్వం ధాన్యం కొనడం లేదన్నారు. ధాన్యంతో కొనుగోలు కేంద్రాలన్నీ నిండిపోయాయన్నారు. స్థలం లేక రైతులు రోడ్లపై కుప్పలుపోసి పడిగాపులు కాస్తున్నారన్నారు. సన్న వడ్లకు బోనస్‌పైన పరిమితులు పెట్టాలనుకుంటున్నారన్నారు. ఎన్నికలకుముందు ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల సన్నవడ్లతోపాటు, దొడ్డు వడ్లకు బోనస్ ప్రకటించాల్సిందేనన్నారు. వరి కొనుగోలు జాప్యాన్ని నిరసిస్తూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించి సోమవారం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 7,572 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటికే 4,598 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు పేర్కొందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తమకు అందిన సమాచారం మేరకు ఒక్క కేంద్రంలోనూ కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు. వర్షాలతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ధాన్యం తడిసి పోయాయన్నారు. అకాలవర్షాల వల్ల చేతికొచ్చిన పంట నీళ్లపాలైందన్నారు. కరీం నగర్ పార్లమెంట్ పరిధిలోని చొప్పదండి, సిరిసిల్ల, మానకొండూర్, హుజూరా బాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల్లో ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఎండబెట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులు విసిగిపోయి మిల్లర్లకు తక్కువ ధరకు అమ్ముకుంటునేలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. తక్షణమే వరి ధాన్యం కొనునుగోళ్లను ప్రారంభించాలని, ఇచ్చిన హామీల మేరకు తాలు తరుగు, తేమతో సంబంధం లేకుండా ప్రతి గింజనూ కొనుగోలు చేయాలన్నారు. ఎన్నికల మెనిఫేస్టోలో పెట్టినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల చొప్పున బోనస్ చెల్లించాలన్నారు. సన్న వడ్లకే బోనస్ చెల్లిస్తామని మెలిక పెట్టడం సమంజసం కాదన్నారు. ఎకరాకు 30 క్వింటాళ్ల మేర సన్న వడ్లు పండినప్పటికీ అందులో కొంత మేర మాత్రమే కొనుగోలు చేయాలని, సన్న వడ్లను నిర్ధారించడానికి అనేక కొలతలు ప్రామాణికంగా చేయాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు పంపించినట్లు సమాచారం ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని కోరుతూ సోమ వారం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో తహసీ ల్దార్లకు వినతిపత్రాలు అందించాలని కోరారు.

ఆరు గంటల పాటు లైవ్ మ్యూజిక్ షో

- ఐదు రికార్డులు సొంతం చేసుకున్న సల్వాజి సంధ్య



సంధ్యకు ఐదు రికార్డులను అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్



పాడుతున్న సంధ్య

కరీంనగర్ కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాకు చెందిన గాయని సల్వాజి సంధ్య ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆరు గంటల పాటు లైవ్ మ్యూజిక్ షో చేసి పలు రికార్డులు సొంతం చేసుకుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సినీ నేపథ్య గాయని కేఎస్ చిత్రపాడిన 72 పాటలను సంధ్య పాడింది. ఈ సందర్భంగా ఆమెకు భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కల్చరల్ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డు, సింగర్స్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులను అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఇండియా ప్రతినిధి కేవీ రమణారావు అందజేశారు. ఆమె గానానికి తబలాపై ఆర్ అనిల్, ఎం. ప్రశాంత్, రిథమ్ ప్యాడ్‌పై ఎస్ మహేందర్, కె వినోద్, కీబోర్డుపై సతీశ్, సాయి, సత్యం, డ్రమ్స్‌పై మల్లేశ్ వాయిద్య సహకారం అందిం చినందుకు భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు చేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన సల్వాజీ మ్యూజిక్ గ్రూప్, ఈవెంట్స్ ఆర్గనైజేషన్ వ్యవవస్థాపక చైర్మన్ సల్వాజి ప్రవీణ్‌కు భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, జీనియస్ బుక్ వరల్డ్ రికార్డ్‌లో నమోదు చేశారు. కళాకారులు డీఎల్ నామ్‌దేవ్, కృపాదానం, గొల్లపల్లి రవీందర్, మురళి మధుకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పొన్నం రవిచంద్ర, కెఎస్ అనంతాచార్య, గోగుల ప్రసాద్, బాబు గౌరవేని పాల్గొన్నారు.

శిల్పకళా నైపుణ్యం



- శిలలకు ప్రాణం పోస్తున్న శిల్పులు
- 15 ఏళ్లుగా దేవతామూర్తుల రూపకల్పన
- ఇతర జిల్లాలకు సరఫరా

దేవుళ్ల విగ్రహాల తయారీలో హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు పట్టు సాధించారు. ఎటువంటి రాతి విగ్రహాలనైనా అందంగా మలుస్తూ వాటికి ప్రాణం పోస్తున్నారు. దీంతో వీరి ప్రతిభకు తగిన ప్రతిఫలం లభించడం ప్రారంభమైంది. ఇతర జిల్లాలకూ వీరు తయారు చేసిన విగ్రహాలను సరఫరా చేస్తున్నారు.

హుజూరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రూపం లేని శిలలను తీసుకవచ్చి తమ శిల్ప కళ నైపుణ్యంతో సుందరంగా తీర్చిదిద్ది వాటికి రూపాన్ని ఇచ్చి జనం దైవంగా కొలిచేలా ప్రాణం పోస్తున్నారు. తమ కళా నైపుణ్యతో అందమైన దేవతా విగ్రహాలు తయారు చేస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులు హుజూరాబాద్‌కు బతుకుదెరువు కోసం 40ఏళ్ల క్రితం వచ్చారు. మొదట రోళ్లు తయారు చేసి జీవించేవారు. 15 ఏళ్ల క్రితం విగ్రహాలు తీయారు చేయడం ప్రారంభించారు. మరికొందరికి విగ్రహాల తయారీలో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం 10 మంది వరకు విగ్రహాలు తయారు చేస్తున్నారు. గతంలో గ్రామాల్లో పురాతనమైన కర్రలతో చేసిన విగ్రహాలు ఉండేవి. కాలక్రమంలో అవి దెబ్బతినడంతో వాటి స్థానంలో కొత్త విగ్రహాలను ప్రజలందరూ కలిసి ప్రతిష్ఠించుకుంటున్నారు. ప్రతి గ్రామంలో భూదేవి, నవగ్రహ విగ్రహాలు, పోచమ్మ, శ్రీసీతారామలక్ష్మణుడు, ఆంజనేయస్వామి, శివుడు, నంది, సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించుకుంటున్నారు. వీరందరూ హుజూరాబాద్‌కు వచ్చి తమకు అవసరమైన విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు.



● ఆంధ్రప్రదేశ్ నుంచి శిలలు..

చాలా ఏళ్ల క్రితం ఉన్న విగ్రహాల స్థానంలో కొత్త వాటిని ప్రతిష్ఠిస్తున్నారు. ప్రతీ గ్రామంలో ఇదేవిధంగా విగ్రహాలను తీసుకెళ్తుండడంతో హుజూరాబాద్ శిల్పులకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిల్కలూరిపేట మండలం మాటూరు గ్రామం నుంచి శిల్పాలను తయారు చేసే శిలలను వీరు తీసుకువస్తారు. తర్వాత ఆర్డర్ల మేరకు అవసరమైన విధంగా కట్ చేసుకుంటారు. అనంతరం ఆ శిలలపై స్కెచ్‌లు వేసి విగ్రహాలను రూపొందిస్తారు. ఆదరణ బాగుండడంతో నాలుగేళ్లుగా సిబ్బందిని పెట్టుకొని విగ్రహాలు తయారు చేస్తున్నారు. హుజూరాబాద్‌లో పది దుకాణాల వరకు కరీంనగర్, హనుమకొండ రోడ్‌లో ఏర్పాటు చేసుకున్నారు. విగ్రహాల కోసం కొంత మంది ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటారు. విగ్రహాల ధర 10 వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు ఉంటుంది. చుట్టుపక్కల జిల్లాల్లో చాలా గ్రామాల్లో హుజూరాబాద్ శిల్పులు తయారు చేసిన దేవతామూర్తులే కనిపిస్తుంటాయి.

మున్నూరు కాపులు ఐక్యతతో ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

పెద్దపల్లిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపులు పార్టీలకు అతీతంగా ఐక్యతతో ముందుకు సాగాలని, సమాజానికి దిక్సూచిగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి జిల్లా బందంపల్లిలో ఆదివారం మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మున్నూరు కాపులు పార్టీలకు అతీతంగా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మున్నూరు కాపులు మరింత బలోపేతం చెందాలని ఆకాంక్షించారు. ఇతర కులాలతో కలిసి నడిస్తే బీసీలకు రాజ్యాధికారంలో సరైన వాటా దక్కుతుందన్నారు. రాష్ట్రంలో కులాల లెక్క తేల్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది ఎన్యూమరేటర్లతో సర్వే చేపడుతున్నామని, 50 ప్రశ్నలతో 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్ సర్వే చేస్తారని, సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కులగణన తర్వాత బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు దక్కే చాన్సు ఉందన్నారు. బీసీలకు కాంగ్రెస్ సర్కార్ మేలు చేస్తుందని హామీ ఇచ్చారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఐక్యతతో కలిసి కొట్లాడి మున్నూరు కాపు హక్కులను పరిరక్షించుకుందా మన్నారు. రైతులే దేశానికి వెన్నుముక అని, కేసీఆర్ పాలనలో రైతులకు మేలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎక్కడ ఎన్నికలు జరిగినా కాపు కులస్థుల గెలుపునకు పార్టీలకతీతంగా పనిచేయాలని సూచించారు. కులగణన జరిగి తీరాల్సిందేనని, అప్పుడే కాపుల లెక్క బలం తేలి రాజ్యాధికారం వైపు అడుగులు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పెద్దపల్లి జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ రాజకీయంగా కాపులు ఎదగకుండా కొన్నివర్గాల వారు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కాపులకు పిలుపునిచ్చారు. అగ్రవర్ణ దోపిడీ దారులే రాజకీయంగా ఎదుగుతున్నా కాపులను అణిచివేసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాపులు అప్రమత్తంగా ఉండాలని, అగ్రవర్ణ కుట్రలకు బలికావద్దని సూచించారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ రవి చంద్ర, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధులను సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనమాల ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు అనుమాల మహేష్, యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్, జిల్లా అధ్యక్షుడు తొగరి సురేష్, నాయకులు ఎడ్ల రవి, డాక్టర్ రాజ్‌కుమార్, అనిల్, కిషన్, బాలకృష్ణ, రాజేందర్, తోట కాంతయ్య, పూదరి కిషన్, దాసరి రాజేశం, కాపు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న క్షేత్రంలో కార్తీక సందడి



భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

వేములవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం కార్తీక సందడి నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయ ఆవరణలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక మాసం ప్రారంభం కావడం, ఆదివారం కావడంతో భక్తుల సంఖ్య అధిక సంఖ్యలో వచ్చారు. అధికారులు గర్భాలయంలో స్వామివారి అభిషేకం, అన్న పూజ నిలిపివేశారు. నందీశ్వరుని వెలుపలి వద్ద నుంచి దర్శనానికి అనుమతించారు. ఈవో వినోద్ రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు.

అంజన్న సన్నిధిలో సినీనటుడు

మల్యాల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు కిరణ్ అబ్బవరం ఆదివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. మరి కొంత మంది సినీ నటులతో కొండగట్టుకు వచ్చిన కిరణ్ స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈవో రామకృష్ణరావు శేషవస్త్రాలతో సత్కరించారు. అభిమానులు కిరన్‌తో సెల్ఫీలు తీసుకున్నారు.



ఈవోతో మాట్లాడుతున్న కిరణ్ అబ్బవరం

సామ్రాజ్యవాద పాలకులను అడ్డుకోవాలి

- అదే అమరులకు నిజమైన నివాళి

- సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి జేవీ చలపతిరావు

జ్యోతినగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాద పాలకులను, కార్పొరేట్ సంస్థలకు దాసోహమైన ప్రభుత్వాలను నిలువరించినప్పుడే అమరులకు నిజమైన నివాళి అర్పించినట్లని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, జాతీయ నేత జేవీ చలపతిరావు అన్నారు. ఆదివారం ఎన్టీపీసీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద భూమి, భుక్తి, దేశ విముక్తి కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరుల సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చలపతిరావు ప్రసంగిస్తూ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాడి ప్రాణ త్యాగాలు చేసిన అమరుల స్ఫూర్తిని వర్గపోరాటాలను నిర్మించాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగా పోరాటంతో ఉత్తేజితమై దేశంలో రైతాంగ, శ్రీకాకుళ, నర్సల్బరీ, గోదావరి లోయ పోరాటాలు పురుడు పోసుకున్నాయని పేర్కొన్నారు భూస్వామ్య, దోపిడీ వ్యవస్థలను అంతమొందించకుండా ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పరిష్కారం కావని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూనే పాలక వర్గాల దోపిడీ, అణచివేత, అభివృద్ధి నిరోధక విధానాలపై వర్గ పోరాటాలు, సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పదేళ్లుగా విడివిడిగా ఉద్యమాలు చేస్తున్న సీపీఐఎంఎల్, న్యూ డెమోక్రసి పార్టీలు త్వరలో ఏకమౌతాయని, ఐక్యతలో భాగంగానే అమరుల సంస్మరణ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలుత విముక్తి పోరాటాలలో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. అరుణోదయ కళాకారులు సంస్మరణ గీతాలు ఆలపించారు. సభకు న్యూడెమక్రసీ జిల్లా కార్యదర్శి కె రాజన్న అధ్యక్షత వహించగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్, అధ్యక్షుడు ఐ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఇ నరేష్, రామకృష్ణ, కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి చిలుక శంకర్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె జ్యోతి, అరుణోదయ నేత బతుకుల రాజన్న, రైతు సంఘం నేత చంద్రయ్య, నాయకులు మల్లేష్, లింగమూర్తి, పీవైఎల్ జిల్లా కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ నేత జేవీ చలపతిరావు

చాక్‌పీస్‌లపై కళాకృతులు

• ప్రభుత్వ ఉపాధ్యాయుడి అద్భుత నైపుణ్యం

వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిగా కొనసాగుతూ ప్రవృత్తిగా చిత్ర కళను ఎంచుకున్నాడు. చాక్‌పీస్‌లను అందమైన ఆకృతులుగా మలుస్తూ ఔరా అనిపిస్తున్నాడు. సుద్దముక్కలపై అద్భుత కళాకృతులను ఆవిష్కరించి అవార్డులు సొంతం చేసుకుంటున్నాడు. మరోవైపు యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు శిక్షణ అందిస్తున్నాడు చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కపిల్ల నరేశ్.



సుద్ద ముక్కపై చిత్రాలను చెక్కుతున్న నరేష్



రికార్డులతో ఉపాధ్యాయుడు నరేష్

చందుర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కపిల్ల నరేశ్‌కు చిన్నతనం నుంచి కళలపై ఆసక్తి. ఈ క్రమంలో చాక్‌పీస్‌లపై కళాకృతులు రూపొందించడం ప్రారంభించాడు. అనేక అద్భుతాలు ఆవిష్కరించి రికార్డులు సొంతం చేసుకున్నాడు. ప్రస్తుతం చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నరేష్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. పిల్లలకు పాఠాలు చెబుతూనే చాకీపీస్‌లతో అద్భుత కళారూపాలను ఆవిష్కరిస్తున్నాడు. అర సెంటీమీటర్ వినాయకుడు, సెంటీమీటర్ నంది, విమానం తదితర నమూనాలను సుద్దముక్కలపై తీర్చిదిద్దాడు. ఖాళీ సీసాలు, సిరంజీలతోనూ వివిధ ఆకృతులను తయారు చేశాడు. ఇప్పటివరకు 50 మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను చాక్ పీస్‌లపై రూపొందించాడు. రివర్స్ రైటింగ్‌లోనూ ప్రావీణ్యం సంపాదించాడు. మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి తనవంతుగా కృషి చేస్తున్నాడు. మ్యాజిక్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాడు. తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గంట సమయంలోనే సుద్ద ముక్కపై జాతీయ గీతాన్ని రాశారు. భూతద్దంతో చూస్తేనే ఈ అక్షరాలు కనిపిస్తాయి. ఇగురం టీవీ అనే యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతీ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు కోచింగ్ ఇస్తున్నాడు. ఇప్పటికే వందలాది మంది నిరుద్యోగులు యూట్యూబ్ ఛానల్ ద్వారా కోచింగ్ తీసుకొని ఉద్యోగులు సాధించారు. ఈ క్రమంలో నరేష్‌ను అనేక అవార్డులు వరించాయి. బుక్ అఫ్ స్టేట్ రికార్డ్స్ తెలంగాణ, బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ తదితర అనేక రికార్డులు సొంతమయ్యాయి.



సుద్దముక్కలపై చెక్కిన వివిధ చిత్రాలు

ధర్మపురిలో యమ ద్వితీయ వేడుకలు

ధర్మపురి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో యమ ద్వితీయ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. యమ ధర్మరాజు దేవాలయంలో ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య స్వామి వారలకు రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, మహా సంకల్ప పూర్వకంగా అభిషేకం జరిపారు. అనంతరం హారతి, మంత్ర పుష్ప, తీర్థ, ప్రసాద వితరణలు జరిపారు. అధిక సంఖ్యలో శాశ్వత నిధి సభ్యులు, భక్తులు, గ్రామస్థులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



స్వామికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

రెండో రోజు ఘనంగా గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో రెండో రోజు గోదావరి హారతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మం త్రోచ్ఛరణల మధ్య సాయంత్రం గోదావరి వరకు శోభాయాత్ర నిర్వహించారు. నది వద్ద ప్రత్యేక పూజలు చేసి గోదావరి నదికి హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపారా యణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి పాల్గొన్నారు.



గోదావరి నది వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 3: మెరుగైన ఆరోగ్యానికి సహజ యోగ, ధ్యానం ఉపయోగ పడుతుందని సాహస యోగా కమిటీ తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గౌరి కృష్ణ అన్నారు. ఆదివారం నగరంలోని జ్యోతినగర్‌లో సహజ యోగ ధ్యానంపై గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు చైతన్య రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధుపుంగవులు, మనులు కష్టపడి తపస్సు చేసి సాధించగలిగిన శక్తిని మాతాజీ నిర్మలాదేవి ఇప్పుడు అతి సులువుగా మనం దరికీ కలగజేస్తున్నారని అన్నారు. సహజ యోగా వలన 120 దేశాల్లో లక్షలాది మంది ప్రయోజనం పొందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి,

ఇండియన్ గ్రాండ్ మాస్టర్ అర్జున్‌కు సత్కారం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 3: ప్రపంచ చెస్ ఒలింపియాడ్‌లో అద్వితీయ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించిన ఇండియన్ గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్‌ను ఆదివారం వరంగల్‌లోని ఆయన నివాసంలో కరీంనగర్ జీనియస్ చెస్ అకాడమీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. భారత నెంబర్ వన్ గ్రాండ్ మాస్టర్ ప్రపంచ 3వ చదరంగం ఆటగాడిగా 2800 రేటింగ్ నమోదు చేసి తొలిసారిగా తన స్వగృహానికి వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి ఘనంగా సత్కరించారు. అర్జున్‌తోపాటు తన తల్లిదండ్రులకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. చెస్‌లో భారత్‌ను ప్రపంచ నెంబర్‌వన్‌గా నిలపడమే తన లక్ష్యమని, భవిష్యత్తులో మెరుగైన కోచింగ్ తీసుకొని ముందుకు వెళ్తానని, చెస్‌లో రాణించేందుకు ప్రతి ఒక్క క్రీడాకారులు ముందుకు రావాలని అర్జున్ తెలిపినట్లు జీనియస్ చెస్ అకాడమీ కోచ్, డైరెక్టర్ కంకటి అనూప్‌కుమార్ తెలిపారు. అర్జున్ ఇండియా నెంబర్ వన్‌గా, ప్రపంచ మూడో స్థానంలో ఉండడం తెలంగాణకు గర్వకారణమని, రాబోయే రోజుల్లో తెలంగాణకు పేరు తీసుకురావాలని అనూప్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, అర్జున్ తల్లిదండ్రులు డాక్టర్ శ్రీనివాస్, జ్యోతి, కోచ్ సృజన్ కుమార్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం



మాట్లాడుతున్న ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్

కరీంనగర్ టౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మొట్టమొదటిసారిగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంఐఎం పోటీ చేస్తుందని ఆపార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్‌హుస్సేన్ అన్నారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో ఉమ్మడి జిల్లా ఎంఐఎం పార్టీ విస్తృతస్థాయి నాయకులు, ప్రజాప్రతినిధుల సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గులాం అహ్మద్‌హుస్సేన్ మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ అధినేత, ఎంపీ అసదొద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఒవైసీ ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలో త్వరలో జరిగే సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పోటీ చేస్తుందని ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో ఎంఐఎం నుంచి పోటీ చేయాలనుకునే ఆశావహులు స్థానిక ఎంఐఎం పార్టీ బాధ్యులను సంప్రదించాలని సూచించారు. పార్టీ ఆదేశాల మేరకు సంస్థాగతంగా బలోపేతం చేసుకొని ప్రజలతో మమేకమై పోటీకి సిద్ధపడాలని సూచించారు. ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలనేది పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. కరీంనగర్‌లో 25 డివిజన్లలో పోటీచేసి 20 స్థానాల్లో గెలిచేలా ప్రణాళిక రూపొందించుకుంటున్నామన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కైవసం చేసుకొని పార్టీ జెండా ఎగుర వేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎంఐఎం పార్టీ పేరెత్తకుండా కేంద్రమంత్రి బండి సంజయ్‌కి రోజు గడవదని విమర్శించారు. హైదరాబాద్ పాతబస్తీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడం వల్లనే నాలుగు దశాబ్దాలుగా అక్కడ ఎంఐఎం విజయకేతనం ఎగుర వేస్తుందనే విషయాన్ని గమనించాలని అహ్మద్‌హుస్సేన్ అన్నారు. కేంద్రమంత్రిగా బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్‌కు ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని, ఓవైసీ సోదరులపై విమర్శలు చేయడం సరికాదని ఖండించారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, యూనూస్ నదీమ్, ఉమ్మడి జిల్లా నాయకులు రఫీ, అక్రమ్, ఇమ్రాన్ అలీ, మీర్ జాకీర్ అలీ, హఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ, యూసూఫ్, ఖమ్రుద్దీన్, అతిన, ఇబ్రహీం, కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

'బీజేపీ సభ్యత్వ నమోదుకు అపూర్వ స్పందన'


మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్

కరీంనగర్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని మండల బీజేపీ అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని చామనపల్లి గ్రామంలోని కళ్యాణ మండపంలో కరీంనగర్ రూరల్ బీజేపీ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగు తోందన్నారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునేవారు మంచి అవకాశమన్నారు. ప్రతి బూత్‌లో 200 సభ్యత్వాలు తగ్గకుండా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఈనెల 6లోగా సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తవు తుంద న్నారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ కో కన్వీనర్ దూడెం శ్రీనివాస్, క్రియాశీల సభ్యత్వ కన్వీనర్ మల్లేత్తుల దేవేందర్, బీజేపీ మండల, జిల్లా నాయకులు బాలి సత్యం, కమలాకర్‌రెడ్డి, శ్రావణ్ రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రామచంద్రం, నారాయణ, శివరామకృష్ణ, ప్రవీణ్, శ్రీధర్, యుధిష్టరు శేఖర్, శంకరయ్య, సంజీవ్, బూత్ అధ్యక్షుడు హరీష్, రమేశ్, అమరేందర్‌రెడ్డి, సంపత్, రాజు, చందు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అజయ్



సుభాష్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కరీంనగర్‌కు చెందిన కొప్పుల అజయ్‌ని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారికి అజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రులు యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ టౌన్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక యాప్‌ను రూపొందించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి కోరారు. వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆదివారం నగరంలోని శ్రీగిద్దెపెరుమాండ్ల స్వామి దేవాలయ మైదానంలో వాకర్స్, జిల్లా గ్రంథాలయంలో పట్టభద్రులతో ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల, ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిని వేదికగాచేసుకొని కృషిచేస్తానని, ఉద్యోగ, ఉపాధ్యాయుల, పట్టభద్రులకు మేలు జరిగే విధంగా ప్రభుత్వానికి సూచనలు ఇస్తానని అన్నారు. తనకు అవకాశమివ్వాలని ఆయన కోరారు.

విలీన గ్రామాలకు 'అమృత్' నిధులు

(5వ పేజీ తరువాయి)

అందిస్తున్నారు. అయినా పూర్తిస్థాయిలో ప్రతిరోజు నీరు సరఫరా చేయడం సాధ్యం కావడం లేదు. నగరపాలక సంస్థకు న్నులు చెల్లిస్తున్నప్పటికీ కనీసం తాగేందుకు మంచినీరు కూడా ఇవ్వరా అంటూ విలీన డివిజన్ల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

●విలీన డివిజన్లలో రోజూ మంచినీటి సరఫరా
-మేయర్ యాదగిరి సునీల్‌రావు


రెండో విడత అమృత్ నిధులు 147 కోట్లతో నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాలు (డివిజన్లు), కొత్తగా ఏర్పడిన శివారుకాలనీల్లో ప్రతిరోజు మంచినీటి సరఫరా జరుగుతుంది. మొదటి విడత 132 కోట్ల నిధులతో నగరంలో ప్రతిరోజు మంచినీటిని సరఫరా చేస్తున్నాజ రెండో విడత నిధులతో విలీన గ్రామాలు, శివారు ప్రాంతాల్లో ప్రతిరోజు మంచినీటిని అందించే విధంగా ప్రణాళిక రూపొందించాము. ప్రజారోగ్యశాఖ అందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను పూర్తి చేసింది. తొమ్మిది నెలల గడువు ఉన్నప్పటికీ ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు మంచినీటిని అందిస్తాం... అమృత్ పథకం నిధుల మంజూరుకి సహకరించిన ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు, కేంద్రప్రభుత్వానికి, అప్పటి బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలకు పాలకవర్గం, నగర ప్రజల తరుపున కృతజ్ఞతలు.

ఆలయంలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న తొగుట పీఠాధిపతి మాధవానందసరస్వతీ

కరీంనగర్ కల్చరల్, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాంపూర్ గిద్దెపెరుమాళ్ళ ఆలయంలో ఆదివారం పురాణం మహేశ్వరశర్మ వైదిక నిర్వహణలో తొగుట పీఠాధిపతి మాధవానందసరస్వతీస్వామి చేతుల మీదుగా ధ్వజస్తంభ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. దైవ చింతన, దైవిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఆధ్యాత్మిక, మానసిక, శారీరక ప్రశాంతత చేకూరుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమీషనర్ నాయిని సుప్రియ, ఈఈ రాజేశ్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, ఆలయ ఈఓ ఎండపెల్లి మారుతి, అర్చకుడు రామక శంకరశర్మ, ధ్వజస్తంభ దాత, నిర్మాణ కర్త, 32వ డివిజన్ కార్పొరేటర్ మర్రి భావనా సతీశ్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

యోగా ఫర్ ఉమెన్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో యోగాచార్య సంపత్‌కుమార్ రచించిన 'యోగా ఫర్ ఉమెన్' పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సినారె రాష్ట్ర స్థాయి పురస్కార ప్రదాత, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి మాట్లాడుతూ మహిళల జీవన విధానానికి యోగా దివ్య ఔషధం అని అన్నారు. ప్రస్తుత మహిళల జీవన విధానం చాలా ఒత్తిడితో కూడుకున్నదని, వారికి పౌష్టిక ఆహారంతో పాటు మానసిక, శారీరక ఉల్లాసానికి యోగాసనాలు అవసరమని, దీంతో దీర్ఘ కాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని అన్నారు. అతిథులుగా హాజరైన సాహితీవేత్తలు గాజుల రవీందర్, కెఎస్ అనంతాచార్య మాట్లాడారు. సంస్థ అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాందూరి వేంకటేశ్వర్లు, నీలగిరి అనిత, బొమ్మకంటి కిషన్, కవులు, రచయితలు, వ్యాయామ, యోగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు రాక ఇక్కట్లు

-మూడు నెలలుగా పెండింగ్ -తక్షణమే విడుదల చేయాలని వినతి


చెత్తను తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది (ఫైల్)

కరీంనగర్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు రాక ఇబ్బందులకు గురవుతున్నారు. మూడు నెలలుగా సిబ్బందికి వేతనాలు లేక పండుగలు కూడా జరుపుకోలేని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో పరిశుభ్రతకు కీలకమైన పరిశుద్ధ్య కార్మికులకు వేతలను లేక గ్రామ పంచాయతీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో రెండు మూడు నెలలుగా వేతనాలు అందక పోవడంతో పండుగ పూట పస్తులు ఉండే పరిస్థితి నెలకొంది. అప్పులు చేసి చాలీచాలని జీతాలతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం దసరాకు వేతనాలు చెల్లిస్తారని ఎదురు చూసిన కార్మికులు దీపావళికి ఇస్తారని వేచి చూశారు. దీపావళికి కూడా జీతాలు రాక పోవడంతో అప్పులు చేసి పండుగలు జరుపుకున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో మొత్తం 93 మంది కార్మికులు పని చేస్తున్నారు. ప్రభుత్వం మల్టీపర్పస్ కార్మికులుగా గుర్తించి నెలకు 9,500 రూపాయల వేతనం చెల్లిస్తున్నారు. గ్రామ పంచాయతీలకు కొన్ని నెలల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు మంజూరి చేయకపోవడంతో పంచాయతీల్ల పన్నుల వసూళ్ళు కూడా నామ మాత్రంగానే ఉన్నాయి. దీంతో గ్రామ పంచాయతీల్లో నిర్వహణ భారంగా మారండంతో కార్మికులకు జీతాలు భారంగా మారింది. సకాలంలో విధులు నిర్వహించినప్పటికీ సకాలంలో వేతనాలు రాపోవడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధుల నుంచి జూలై నెల వేతనాన్ని అధికారులు చెల్లించారు. ఆగష్టు నుంచి ఇప్పటి వరకు వేతనాలు చెల్లించక పోవడంతో ఆర్థికంగా కార్మికులు ఇబ్బందిగా మారింది, అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో నిధులు విడుల చేయకపోవడంతో పంచాయతీల నిర్వణ బారంగా మారింది, ప్రస్తుతం గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌ల కాలం ముగిసిన తరువాత వారిని పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో గ్రామ పంచాయతీ నిర్వహణ భారంగా మారింది. ప్రస్తుతం సర్పంచులు లేక పోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలో కార్యదర్శులపై భారం పడింది. గ్రామ పంచాయతీల్లో ఖర్చులు, ఇతర నిర్వహణ ఖర్చులను పంచాయతీ కార్యదర్శులు సొంతంగా భరిస్తున్నారు. గతంలో పనిచేసి బదిలీ పై వెళ్లిన పలువురు కార్యదర్శులుకు అప్పులు చేసి ఖర్చులు పెట్టారు. వారికి కూడా ఇప్పటి వరకు వారికి రావలసిన డబ్బులు రాక ఆర్థికంగా వారు ఇబ్బందులకు గురవుతున్నారు.

మేజర్ గ్రామ పంచాయతీల్లో మినహా అన్ని గ్రామ పంచాయతీల్లో కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. వెంటనే గ్రామ పంచాయతీల కార్మికులకు రావలసిన బకాయిలను వెంటనె చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు.

హక్కుల సాధనకు ఉద్యమం

చిగురుమామిడి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రెడ్డి సామాజిక వర్గాల హక్కుల సాధనకు ఉద్యమం చేపడుతామని, అందరూ కలిసి రావాలని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి, రాష్ట్ర ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రెడ్డి సంఘం మండల సమావేశం సంఘం మండల అధ్యక్షుడు కాటం సంపత్‌రెడ్డి అధ్య క్షతన నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా రెడ్డి ఐక్య వేదిక నాయకులు వంచ సుదర్శన్‌రెడ్డి, బండ గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోటు మల్లారెడ్డి, పన్యాల జగన్ రెడ్డి, సమ్మిరెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కర్ర అశోక్‌రెడ్డి, పీచు తిరుపతిరెడ్డి, నంది కొండ మల్లారెడ్డి, వంగాల రాఘవరెడ్డి, దవమంత రెడ్డి, గాజుల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం మండల కార్యవర్గం

చిగురుమామిడి: రెడ్డి సంఘం మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నికున్నారు. మండల రెడ్డి సంఘం అధ్యక్షుడిగా రెండోసారి లంబాడిపల్లి గ్రామానికి చెందిన కాటం సంపత్‌రెడ్డి ఎన్నిక య్యారని, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షులుగా సంది రాజిరెడ్డి, వర్ల కొండల్ రెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కేతిరెడ్డి కొండాల్‌రెడ్డి, రెడ్డి ఐక్యవేదిక మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాంతల మహిపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా యాల్ల జనార్దన్‌రెడ్డి, సింగిరెడ్డి రాజిరెడ్డి, మండల రెడ్డి ఐక్య వేదిక యూత్ అధ్యక్షుడి చామకూరి చంద్రశేఖరెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

రెడ్డి సంఘం గ్రామ కార్యవర్గం

రామడుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):: కొక్కెరకుంట రెడ్డి సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పబ్బతి అంజిరెడ్డి అభి, ఉపాధ్యక్షుడిగా పబ్బతి మల్లారెడ్డి, కార్యదర్శిగా పబ్బతి అంజిరెడ్డి, సహ కార్యదర్శిగా బోళ్ల శేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కోశాధికారిగా బోళ్ల వినయ్‌రెడ్డి, సలహా సంఘం సభ్యులుగా పబ్బని ప్రశాంత్‌రెడ్డి, తౌటు సాగర్‌రెడ్డి, బోళ్ల పవన్‌రెడ్డి, అల్లకొండ వేణురెడ్డి ఎన్నికయ్యారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


కురిక్యాలలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. కురిక్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మధురానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి చేతులు దులుపుకున్నారు. 20 రోజులైనా కేంద్రాలకు ఇప్పటికీ మిల్లులు కేటాయించలేదని చెప్పారు. ధాన్యం వెంటవెంటనే కాంటా వేసి తరలించకుంటే ఆందోళన చేపడుతామని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు ఆకుల మధుసూదన్, మడ్లపల్లి గంగాధర్, సురేందర్, వేముల అంజీ, మడ్లపల్లి శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

విద్యార్థులకు అపార్ కార్డు

- ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు - కేంద్ర ప్రభుత్వం కసరత్తు



అపార్ ఐడీ కార్డు



ఏబీసీ ఐడీ కార్డు

ఇల్లందకుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆధార్ తరహాలో విద్యార్థులకు సంబంధించిన అకడమిక్ వివరాలన్నింటినీ పొందుపరుస్తూ కేంద్ర ప్రభుత్వం 'అపార్'కు రూపకల్పన చేసింది. వన్ నేషన్- వన్ స్టూడెంట్ ఐడీ పేరిట కేంద్ర విద్యాశాఖ 12 అంకెలతో కార్డును కేటాయిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థుల అకడమిక్ వివరాలతో పాటు వారి ధ్రువప త్రాలను డిజిటల్‌గా భద్రపరిచేలా ఈ ఆపార్ కార్డును రూపకల్పన చేసింది. 'అకాడమిక్ బ్యాంకు ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ) ఐడీ అన్నా.. 'అపార్' ఐడీ అన్నా ఒక్కటేనని గందరగోళం పడవద్దని చెబుతున్నారు.

- అకాడమిక్ పరంగా ప్రయోజనం

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్ ఇలా 12 అంకెలతో నంబరు డిజిటల్ కార్డులో ఉంటాయి. అకాడమీ సమాచారం, విద్యార్థి విజయాలు ఎప్పటికప్పుడు నమోదువతాయి. విద్యార్థి సమాచారం మొత్తం ఒకే చోట లభిస్తుంది. ఆన్‌లైన్ నంబరు నమోదు, క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసినా పూర్తి వివరాలు తెలుస్తాయి. విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారేటప్పుడు సైతం ఇబ్బందులు ఉండవు. ఉపకార వేతనాలు, వారు పొందు తున్న ప్రయోజనాలు ఉద్యోగాల భర్తీ సమయంలో అపార్ ఆధారంగా తెలుసుకోవచ్చు. అపార్ కార్డు విద్యార్థుల కు అందించేందుకు తల్లిదండ్రుల సమ్మతి తప్పనిసరి. అపార్‌కార్డు వివరాలు పూర్తి గోప్యంగా ఉంటాయని వారికి అవగాహన కల్పిస్తున్నారు.

కాంగ్రెస్ పాలనలోనే న్యాయం

జమ్మికుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలోనే విద్యార్థులకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ బ్లాక్-బి అధ్యక్షుడు మొలుగూరి సదయ్య అన్నారు. జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాలు, బీసీ రెసిడెన్షియల్స్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్స్, మైనార్టీ గురుకుల పాఠశాలల్లోని మూడో తరగతి నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచడం హర్షణీయమని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి గూడెపు సారంగపాణి, పట్టణ అధ్యక్షులు సుంకరి రమేశ్, నాయ కులు మదన్‌రావు, రాకేష్, మల్లేష్, రవీందర్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

వీణవంక నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మం డల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడు పోతుల బాపురావు ఇబ్బందుల్లో ఉండడంతో పది వేల రూపాయలు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఉయ్యాల రాజు, అమర్, సమ్మన్న, మోటం శ్రీనివాస్, మహ్మద్ ఖాజ, కుమార్, సురేష్, రాజు, శ్రీనివాస్, కోమల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కేశవపట్నంలో పాల్గొన్న 1986-87 పదో తరగతి విద్యార్థులు

శంకరపట్నం/రామడుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కేశవపట్నంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో చైతన్య హైస్కూల్‌లో 2009-10లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముల్కల మల్లేశం

గన్నేరువరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తన ఉనికిని కాపాడుకునేందుకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముల్కల మల్లేశం అన్నారు. మండలంలోని గుండ్లపల్లి వద్ద ఆదివారం ఆయన విలేకరుల సమావే శంలో మాట్లాడారు. పదేళ్ల అధి కారంలో ఉండి అవినీతి, అక్రమాలకు పాల్పడి కోట్ల రూపాయల ఆస్తులను కూడగట్టుకున్న రసమయిని ప్రజలు ఓడించడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని చెప్పారు. ప్రజల మనిషిగా పాలన సాగిస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణకు రసమయి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొల్లి శంక రయ్య, నాయకులు వంగల సత్యనారాయణరెడ్డి, రాజయ్య, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్యను అధికారులు పరిష్కరించాలి

వీణవంక నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాలపల్లి పరిధిలోని గొల్లపల్లిలో పది రోజులుగా గ్రామస్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు సమస్య పరిష్కరించాలని యాదవ సంఘం అధ్యక్షుడు మ్యాకల కొమురయ్య అన్నారు. గ్రామంలో వాటర్ ట్యాంకర్ ద్వారా తమే ఇంటింటికి నీరు అందిస్తు న్నామని అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గుండేటి మహేష్, వంగ రమేష్, ప్రవీణ్, మనోజ్, ప్రదీప్, సదయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను గుర్తించాలి

మానకొండూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం గుర్తించి వారి సమస్యలను పరిష్కరించాలని ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు డిమాండ్ చేశారు. మానకొండూర్‌లో ఆదివారం నిర్వహించిన మండల ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ట్రస్మా మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మేళనంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కరీంనగర్ జిల్లా కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

జమ్మికుంట రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో 30 ఏళ్లుగా సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న తమకు లాస్ట్‌గ్రేడ్ వేతనం రూ.19వేలు అందించడంతో పాటు రెగ్యులరైజ్‌కు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కోదండరామ్‌కు ఆదివారం హుజూరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఉపసర్పంచు మృతి

మానకొండూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నారం గ్రామ మాజీ ఉపసర్పంచు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పడకంటి వీరేశం (42) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కిడ్నీలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందారు.మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు కుటుంబీకులను పరామర్శించారు.